
# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
29-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:155

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# వివాదానికి తాత్కాలిక ఫుల్ స్టాప్!

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల వరకు సైలెన్స్

తరువాత హై కమాండ్ వేట

కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చ

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో గత కొద్ది రోజులుగా వివాదాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. తీవ్ర ఉత్కంఠ రేపిన కొండా సురేఖ, చిన్నారెడ్డిల ఎపిసోడ్ ఎటూ తేలలేదు. ప్రస్తుతానికైతే తాత్కాలికంగా ఉపశమనం లభించినట్లు అయింది. వారిద్దరిపై తీవ్ర చర్యలు ఉంటాయన్న ప్రచారానికి కాంగ్రెస్ హై కమాండ్ బ్రేక్ వేసింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు.. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకునే పరిస్థితిలో లేదు హై కమాండ్. ఈ విషయంలో రాష్ట్ర నాయకత్వానికి సైతం స్పష్టమైన సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వేదికగా భారత రాష్ట్ర సమితి తో పాటు బిజెపిని ఎదుర్కోవాల్సి ఉండడంతో.. సొంత పార్టీలోనే చర్యల పేరుతో మళ్లీ రచ్చ రాజేయడం శ్రేయస్కరం కాదని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో

## అంబటి రాంబాబుకు తీవ్ర అస్వస్థత!



గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రిలో చేరిక

ఆపరేషన్ అనంతరం ఆరోగ్యం నిలకడగా

ఆందోళనలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో**

ఏపీలో సంచలన పరిణామం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

మిగతా 2లో



## బంగారం మైనింగ్ లో హట్టి- సింగరేణి జతకట్టాలి

భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి

సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్దేశం

హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి విస్తృత పర్యటన

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు.

## కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

జంతు సంరక్షణలో పక్షులు కూడా భాగమే

కోడి పందాలను సాంస్కృతిక వారసత్వంగా గుర్తించలేం

సినిమాలు, ఆచారాలు చూపి..పందాలను నడపడం సాధ్యం కాదు

మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టీకరణ

మిగతా 2లో

## జగన్మోహన్ రెడ్డికి షాక్!

పులివెందుల మున్సిపాలిటీలో ఆరు వార్డులు ఏకగ్రీవం

గట్టి ప్రయత్నాల్లో తెలుగుదేశం

తిప్పి కొట్టలేకపోతున్న వైసిపి



తెలుగుదేశం పార్టీ పులివెందుల మున్సిపాలిటీ పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే ఇన్చార్జిల కు టికెట్లు ఇవ్వనని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పారు. అయితే పులివెందులలోనే ఏకగ్రీవాలు చేసి జగన్మోహన్ రెడ్డికి షాక్ ఇవ్వాలని తెలుగుదేశం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఆయన ప్రకటించిన నాటి నుంచి ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. పులివెందులలో ఆరు వార్డులను ఏకగ్రీవం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే జగన్మోహన్ రెడ్డికి షాకింగ్ తప్పేలా లేదు.

- మిగతా 2వ పేజీలో



## రేవంత్ అన్నకు రాఖీ!

నాటకీయ పరిణామాల నడుమ ముఖ్యమంత్రి ఇంటికి మంత్రి సురేఖ

వారి మధ్య సర్దుబాటు సాధ్యమేనా?

ఏదైనా అధికార పార్టీలో ముఖ్యమంత్రికి సంవత్సర మహిళా మంత్రులు రాఖీ కట్టడం ఆనవాయితీ. అయితే తెలంగాణలో అందరి దృష్టి మంత్రి సురేఖ పై పడింది. ఇటీవల పరిణామాలతో ఆమె సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడతారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కానీ ఆమె నేరుగా ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. అయితే ఇంతటితో వారి మధ్య వివాదం ఫుల్ స్టాప్ పడినట్టే అనే టాక్ వినిపిస్తోంది. కానీ అంత పెద్ద వివాదం ఒక్క రాఖీతో సమసిపోతుందా? అనేది అనుమానమే. ఎందుకంటే మంత్రి సురేఖతో పాటు ఆమె కుమార్తె చేసినవి మామూలు వ్యాఖ్యలు కావు. ఉద్దేశపూర్వకంగా.. ఒక ప్రణాళిక బద్ధంగా చేసిన వ్యాఖ్యలు.

**అప్పట్లో మంచి సంబంధాలు..**

వాస్తవానికి ప్రారంభంలో రేవంత్ రెడ్డి తో మంచి సంబంధాలు కొనసాగించారు కొండా దంపతులు. కానీ రాను రాను వారిలో అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి.

మిగతా 2లో

## రాజకీయాలకు అనిల్ కుమార్ యాదవ్ గుడ్ బై!

వైసీపీలో బాధ్యతలు లేకపోవడంతో కీలక నిర్ణయం

జగన్ పట్టించుకోకపోవడంతోనే అంటున్న ప్రత్యర్థులు





## కర్ణాటకలో సంక్షోభం!

అవినీతి ఆరోపణలతో మంత్రి నాగేంద్ర రాజీనామా

వాల్మీకి కార్పొరేషన్ లో అవకతవకలకు బాధ్యత వహిస్తూ నిర్ణయం

డీకే శివకుమార్ ప్రభుత్వంలో సంచలనం

- మిగతా 3వ పేజీలో

## పవన్ సోదర ప్రేమ!

పిఠాపురం నియోజకవర్గంలో 2439 మంది మహిళలకు చీరలు పంపిణీ

రక్షాబంధన్ సందర్భంగా ఒంటరి మహిళలకు అండదేత



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో వేలాదిమంది మహిళలకు

మిగతా 3లో



## పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది


కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ప్రజల్లో బాధ

రేషన్ కార్డులపై మోడీ ఫోటో ఎందుకు వేయరు

సిఎస్ సంజయ్ జాజుతో పలు అంశాలపై చర్చించిన ఈటెల

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా తయారయ్యిందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కెసిఆర్‌ను కాదని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అంతకు మించి అన్నట్లుగా అవినీతి పాలన సాగుతోందని మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా తయారయ్యింది

# అంబటి రాంబాబుకు తీవ్ర అస్వస్థత!



గుండె సంబంధిత సమస్యల బారిన పడ్డారు. శుక్రవారం ఆయన తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన హైదరాబాదులోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు ఆయనకు కీలక వైద్య పరీక్షలు నిర్వహించి.. గుండెపోటుకు గురైనట్లు నిర్ధారించారు. అంబటి రాంబాబు గుండె రక్తనాళాల్లో పూడికలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. తక్షణం ఆయనకు ఆపరేషన్ అవసరం అని నిర్ధారించారు. దీంతో వెంటనే ఆయనకు శస్త్ర చికిత్స చేశారు వైద్యులు. ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్యం పూర్తిగా నిలకడగా ఉందని తెలుస్తోంది. ఆయన కోరుకుంటున్నాట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రత్యేకంగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు అంబటి రాంబాబు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు అన్న వార్త వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆందోళనకు గురిచేసింది. కానీ ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెబుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఉపశమనం.

**కేవలం రెండుసార్లు ఎమ్మెల్యే..**

అంబటి రాంబాబు సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న నేత. కానీ ఆయన రెండుసార్లు మాత్రమే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఆయన తొలి దశలో లీగల్ సెల్ కన్వీనర్ గా వ్యవహరించారు. 1994లో గుంటూరు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలోనే నామినేటెడ్ పదవి చేపట్టారు. నెడ్ క్యాప్ చైర్మన్గా కూడా వ్యవహరించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో రేపల్లె నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ అటు తరువాత 1994, 1999లో పోటీ చేసి ఓడిపోయారు. 2004, 2009లో ఆయన పోటీ చేయలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. బలమైన నాయకుడిగా అవతరించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి కోడెల శివప్రసాద్ చేతిలో ఓడిపోయారు. కానీ 2019లో అదే కోడెల శివ ప్రసాద్ రావు పై గెలిచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్లో మంత్రి అయ్యారు.

**వివాదాస్పద ముద్ర**

అయితే కేవలం రెండుసార్లు మాత్రమే ఈ రాష్ట్రం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు అంబటి రాంబాబు. అయితే వైసిపి హయాంలో తీవ్ర వివాదాస్పద నాయకుడిగా ముద్రపడ్డారు. వైసీపీ అధికారం కోల్పోయిన అంబటి రాంబాబు మాత్రం దూకుడు తగ్గించలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా.. జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ముందు నిలవడంలో అంబటి రాంబాబు ముందుంటారు. అయితే ఆయన ఈరోజు అనుకోని విధంగా అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. అయితే ఆయనకు ఆపరేషన్ అవసరం అని వైద్యులు గుర్తించారు. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. అయితే మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురి కావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. ఆయన త్వరగా కోలుకోవాలని వైసిపి శ్రేణులు ప్రత్యేక పూజలు చేస్తున్నాయి.

# బంగారం మైనింగ్ లో హట్టి- సింగరేణి జతకట్టాలి

రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న పక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన పక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు.అనంతరం యుటీ భూ గర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు.భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుంద, యెమ్నూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.


# వివాదానికి తాత్కాలిక ఫుల్ స్టాప్!

**రాజీనామా అస్త్రం**

మరోవైపు మంత్రి సురేఖ నుంచి వచ్చిన సంకేతాలతోనే కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గినట్లు ప్రచారం నడుస్తోంది. తనపై లేదా తన పదవిపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే ఏకంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆమె సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికిప్పుడు రాజీనామాల పర్వం ప్రారంభం అయితే.. దాని ద్వారా ఉప ఎన్నిక వస్తే ఇబ్బందికర పరిస్థితులు తప్పవని కాంగ్రెస్ హై కమాండ్ భావించినట్లు తెలుస్తోంది. పైగా బీసీ మహిళ నేత కావడంతో ఒకటికి రెండుసార్లు ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు వేడి వాతావరణాన్ని చల్లారిచేందుకు కాంగ్రెస్ తాత్కాలికంగా ఈ అంశాన్ని పక్కన పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది.

**రేవంత్ సైలెంట్..**

మరోవైపు ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి హై




కమాండ్ పై ఒత్తిడి పెంచే అవకాశం లేదు. పెద్దగా ఆసక్తి కూడా చూపించడం లేదు. ప్రభుత్వపరంగా కీలక బిల్లులు, సంక్షేమ పథకాల అమలు, బడ్జెట్ కేటాయింపులపై అసెంబ్లీలో ప్రతిపక్షాల దాడిని తిప్పి కొట్టడం పైనే సీఎం దృష్టి పెట్టారు. ఇటువంటి కీలక సమయంలో పార్టీ ఇన్చార్జులు, క్రమశిక్షణ కమిటీ రిపోర్టులను ముందుకు తెచ్చి వాతావరణాన్ని డైవర్ట్ చేయడం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదు. ఇప్పటికే అధిష్టానానికి స్పష్టమైన సంకేతాలు పంపారు. నిర్ణయ అధికారాన్ని విడిచిపెట్టారు. ఇప్పుడు ఆయన దృష్టి అంత అసెంబ్లీ నిర్వహణపైనే ఉంది.

**తప్పకుండా వివరణలు..**

మరోవైపు వర్షాకాల అసెంబ్లీ సమావేశాల అనంతరం కాంగ్రెస్ పార్టీలో పెను మార్పులు జరగబోతున్నాయి అనేది విశ్లేషకుల మాట. తప్పకుండా అధిష్టానం వారిద్దరి నుంచి వివరణ కోరుతుందని.. అవసరం అనుకుంటే వేటు వేస్తుందని పార్టీలో సీనియర్లు చెబుతున్నారు. అయితే ఇంతలో మంత్రి సురేఖ సీఎం రేవంత్ తో సర్దుబాటు చేసుకునే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం నడుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొండా సురేఖను ఏ పార్టీ కూడా తీసుకోదు అనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. అనవసరంగా రాజకీయ వివాదాలు పెట్టుకుని లేనిపోని సమస్యలు తెచ్చుకోవడం కంటే.. ఇరు వర్గాల వారు రాజీకి వస్తారనే ప్రచారం ఉంది. చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# రేవంత్ అన్నకు రాఖీ!

ప్రధానంగా దేవాదాయ శాఖ పరిధిలో జరిగిన పరిణామాలు వారిని దూరం చేశాయి. ఆ శాఖలో జరుగుతున్న వ్యవహారాలు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చాయి. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా కలుగజేసుకుంది. ఆపై దేవాదాయ శాఖ మంత్రిగా సొంత శాఖలో చాలా విషయాల్లో మంత్రి సురేఖకు సమాచారం లేదు. దీంతో ఆ దూరం మరింత పెరిగింది. రేవంత్ తో ఎడ ముఖం పెడ ముఖం అనే పరిస్థితి వచ్చింది.

**పరకాల వివాదంతోనే..**

మరోవైపు కొండా ఫ్యామిలీ ఎక్కువగా ఇష్టపడే పరకాల నియోజకవర్గంలో ఎదురైన పరిణామాలు మరింత దూరం పెంచాయి. అక్కడ గులాబీ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఆయనకు టిక్కెట్ ఇస్తామన్న స్పష్టమైన హామీతోనే పార్టీలో చేర్చుకున్నారు. కానీ అది మా సొంత నియోజకవర్గం అని.. దానిని ఎట్లా వదులుకుంటాం అంటూ కొండా వర్గం గట్టిగా ప్రశ్నించడంతోనే సమస్య మొదలయింది. కానీ దీనిని ముందే ఊహించింది ఆ ఫ్యామిలీ. అందుకే ఒక రాజకీయ వేదిక ఏర్పాటు చేసుకుని తిరుగుబాటు మొదలుపెట్టింది. కానీ ఎంత జరిగాక మళ్ళీ వారి మధ్య సర్దుబాటు ఉంటుందా? కొండా ఫ్యామిలీకి కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం దక్కుతుందా? అన్నది అనుమానమే.

# జగన్మోహన్ రెడ్డికి షాక్!

**అప్పట్లో జడ్పిటిసి ఫలితం..**

గత ఏడాది పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో విజయం సాధించింది తెలుగుదేశం పార్టీ. అయితే అధికార బలంతోనే గెలిచిందని వైసీపీ తేల్చి చెప్పింది అప్పట్లో. అయితే గతంలో కుప్పం మున్సిపాలిటీని ఏ స్థాయిలో గెలుచుకుందో వైసీపీకి తెలియంది కాదు. అందుకే ఇప్పుడు పులివెందులలో సత్తా చాటి.. జగన్మోహన్ రెడ్డికి షాక్ ఇవ్వాలని టిడిపి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అక్కడ బీటెక్ రవి రంగంలోకి దిగారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులతో చర్చలు జరుపుతున్నారు. ఓ ఆరు వార్డుల్లో వైసిపి సీనియర్లు సైలెంట్ మోడ్ లోకి వెళ్లి పోయినట్లు తెలుస్తోంది. మరింత మంది టీడీపీకి టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఖచ్చితంగా పులివెందుల వైసీపీ నుంచి చేజారడం ఖాయమని ప్రచారం సాగుతోంది.



**రంగంలోకి అవినాష్..**

మరోవైపు కడప ఎంపీ అవినాష్ రెడ్డి గట్టిగానే రంగంలోకి దిగారు. పులివెందుల జడ్పిటిసి ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని.. ముందుగానే పావులు కదుపుతున్నారు. మరోవైపు దుష్యంత్ రెడ్డి అనే యువ నాయకుడు కూడా చాలా యాక్టివ్ గా పని చేస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికలకు కావడంతో ఆయన చైర్మన్గా పోటీ చేయడం ఖాయం. కానీ కౌన్సిలర్లుగా పోటీ చేసిన నేతలు మాత్రం టిడిపికి టచ్ లో ఉన్నట్లు లోకల్ గా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జిగా ఎంపీ అవినాష్ రెడ్డి ఉన్నారు. ఆయనకు జగన్మోహన్ రెడ్డి దిశ నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ అక్కడ టిడిపి ఏకగ్రీవం చేసుకుంటే మాత్రం వైసీపీతో పాటు జగన్మోహన్ రెడ్డికి షాకింగ్ తప్పదు.

# రాజకీయాలకు అనిల్ కుమార్ యాదవ్ గుడ్ బై!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ రగిలిపోతున్నారా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పట్ల ఆవేదనతో ఉన్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల మీడియా ముందుకు వచ్చిన ఆయన తన ప్రస్థానం ముగిసినట్టే అని వ్యాఖ్యానించడంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తగినంత గుర్తింపు లేకపోవడంతోనే అనిల్ కుమార్ యాదవ్ పెద్దగా యాక్టివ్గా లేరన్న ప్రచారం జోరుగా నడుస్తోంది. ముఖ్యంగా నెల్లూరు సిటీ నియోజకవర్గ బాధ్యతలు కావాలని ఆయన కోరుతుంటే.. జగన్మోహన్ రెడ్డి పట్టించుకోవడం లేదన్న టాక్ ఉంది. అందుకే పార్టీ కార్యక్రమాల పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదట అనిల్ కుమార్ యాదవ్. ఎప్పుడైనా నెల్లూరు వచ్చి ఒక ప్రెస్ మీట్ పెట్టి వెళ్ళిపోతున్నారట. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కూడా ఆయన కనిపించక పోవడం వెనుక ఇదే కారణం ఉన్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం బలంగా వినిపిస్తోంది.

**మొన్న ఎన్నికల్లో ఎంపీగా పోటీ..**

మొన్నటి ఎన్నికల్లో అనిల్ కుమార్ యాదవ్ నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అనిల్ కుమార్ యాదవ్ కు వ్యతిరేకత ఉందని భావించి జగన్ స్థానచలనం చేశారు. ఈ విషయంలో తనకు ఇష్టం లేకపోయినా మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో అనిల్ కుమార్ యాదవ్ పోటీ చేశారు. కానీ ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే చాలామంది నాయకులకు పూర్వపు నియోజకవర్గాలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. కానీ అనిల్ కుమార్ యాదవ్ విషయంలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. నెల్లూరు సిటీలో ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి పట్టు బిగిస్తుండడంతో అనిల్ కుమార్ యాదవ్ కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. అందుకే నిర్వేదంతో ఉన్నట్లు తెలుస్తోంది..

**కాంగ్రెస్ ద్వారా ఎంట్రీ..**

కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు అనిల్ కుమార్ యాదవ్. నెల్లూరు నగరపాలక సంస్థలు కార్పొరేటర్ గా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ 2009లో.. కొత్తగా అవతరించిన నెల్లూరు సిటీ నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 2014 ఎన్నికల్లో గెలిచారు. 2019లో రెండోసారి గెలిచేసరికి అనిల్ కుమార్ యాదవ్ ను తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే రెండేళ్లకే మంత్రివర్గ విస్తరణలో పదవి కోల్పోయారు. అనిల్ కుమార్ యాదవ్ వైఖరి కారణంగా వైసీపీ నుంచి చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఆ కారణంతోనే నరసరావుపేట ఎంపీ టికెట్ ఇచ్చారు జగన్. అక్కడ ఓడిపోయిన అనిల్ కుమార్ యాదవ్ తిరిగి నెల్లూరు కోరుకుంటున్నారు. జగన్ పట్టించుకోకపోయేసరికి తీవ్ర అసహనంతో ఉన్నారు. ప్రత్యామ్నాయ వేదిక లేకపోవడంతో అనిల్ రాజకీయాలనుంచి తప్పుకోవాలని చూస్తున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

హైదరాబాద్: నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

# కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

చెన్నై:కోడిపందేలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ పందేలు నిర్వహించడం చట్టపరిధిలో పూర్తిగా నిషేధమని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టం చేసింది. గతంలో అనుమతులిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టపరంగా చెల్లవని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కోడిపందేల నిర్వహణ పౌరుల ప్రాథమిక హక్కు కాదని తేల్చిచెప్పారు. జంతు హింస నిరోధక చట్టం-1960 ప్రకారం కోడిపందేలు తీవ్ర నేరమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. 'రిట్ ఆఫ్ మాండమస్' కింద అనుమతులు జారీ చేయలేమని తేల్చిచెప్పారు. కోడిపందేలకు 'సంస్కృతి' హోదా ఇవ్వలేమని పేర్కొన్నారు. సినిమాలు, ఆచారాల్లో ప్రసిద్ధి చెందినంత మాత్రాన ఈ పందేలను సాంస్కృతిక క్రీడగా గుర్తించలేమని తెలిపారు. జల్లికట్టు తరహాలో ప్రత్యేక చట్టసవరణ లేనంతవరకు మినహాయింపులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. కత్తులు కట్టకపోయినా పందేలు నేరమేనని చెప్పుకొచ్చారు. కత్తులు లేవనే సాకుతో ఈ పందేలకు అనుమతి కోరిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. జంతు సంక్షేమ చట్టంలో 'పక్షులు' కూడా భాగమేనని స్పష్టం చేశారు. జల్లికట్టు లాగా ప్రత్యేక చట్టసవరణ తీసుకువస్తేనే మినహాయింపు దక్కుతుందని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ స్పష్టం చేశారు. గతంలో కోడిపందేలకు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. గత తీర్పులను భవిష్యత్తు కేసుల్లో నిదర్శనంగా పరిగణించరాదని తెలిపారు. ఆయా షరతులతో కోడిపందేలకు అనుమతి ఇచ్చిన పాత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్‌లో కీలక తీర్పు వెల్లడించారు. కత్తులు కట్టకుండా నిర్వహించినా కోడిపందేలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పక్షులకు గాయాలు కాకుండా చూడాలనే షరతులతో ఇచ్చిన పాత అనుమతులు కూడా చట్టానికి విరుద్ధమేనని తెలిపారు. జంతు హింస నిరోధక చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి ఈ పందేలకు అనుమతి ఇవ్వలేమని అన్నారు. కోడిపందేలకు అనుమతి ఇచ్చిన గత డివిజన్ బెంచ్ ఉత్తర్వులు 'పూర్తిగా అనవసరం' అని వ్యాఖ్యానించారు.

# పవన్ సోదర ప్రేమ!

పట్టుచీరలతో పాటు నూలు వస్త్రాలను అందించారు. దాదాపు నియోజకవర్గంలో 2439 మందికి పైగా వితంతు మహిళలు, 45 సంవత్సరాల లోపు ఉన్నవారికి తన తోబుట్టువులుగా భావించి చీరలను అందించారు. నిజంగా ఇది గొప్ప విషయం. గతంలో కూడా ప్రత్యేక పర్వదినాల్లో పిఠాపురం మహిళలకు పెద్ద ఎత్తున చీరలను పంపిణీ చేశారు పవన్. రక్షాబంధన్ సందర్భంగా మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నారు. తోబుట్టువులుగా భావించి వేలాదిమందికి చీరలను అందించారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

గొల్లప్రోలు మున్సిపల్ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ కళ్యాణ్ సొంత డబ్బులతో అందించిన పట్టు వస్త్రాలతో పాటు నూలు చీరలను కమిషనర్ మహిళలకు అందజేశారు. పవన్ కళ్యాణ్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. దీంతో



మహిళలు ఎంతగానో ఆనందించారు. తమను తోబుట్టువులుగా భావించి చీరలు అందించినందుకు పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కేరళలో ప్రకృతి వైద్యం పొందుతున్నారు పవన్ కళ్యాణ్. ఆయన వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు మహిళలు.

**గతంలో అనేకసార్లు..**

గతంలో శ్రావణమాసం సందర్భంగా మెగా బ్రదర్ నాగబాబు సతీమణి చేతుల మీదుగా వేలాదిమందికి చీరలు అందించారు. ప్రత్యేక పర్వదినాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఒక్క పిఠాపురం మాత్రమే కాదు గిరిజన ప్రాంతాల విషయంలో కూడా పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ అంతా ఇంతా కాదు. గతంలో ఓ గిరిజన గ్రామ ప్రజలు చెప్పులు లేకుండా ఉండడాన్ని చూసి వేలాది జతలను పంపించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గిరిజన మహిళలకు పండగ పూట చీరలు పంపించి వారి ఆనందానికి కారణమయ్యారు. తన సొంత వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఫలాలను సైతం పంపించి వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పుడు ఏకంగా పిఠాపురం నియోజకవర్గంలో వేలాదిమందికి చీరలు పంపించి తోబుట్టువుగా మారారు రక్షాబంధన్ నాడు.

# పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది

**(మొదటి పేజీ తరువాయి)**

ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ ఫోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారని ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు. హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా

చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

# బాలిక ఆరోగ్యంపై మంత్రి ఆరా

## ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం ఆ బాలిక ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆ బాలిక ఆరోగ్యపరిస్థితిని పర్యవేక్షించడం తోపాటు కుటుంబ సభ్యుల బాగోగులను కూడా తెలుసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

## ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.

# గోదావరిఖనిలో మృత్యుంజయ హోమం

గోదావరిఖని: రాఖీ పూర్ణిమ పర్వదినం పురస్కరించుకొని లోక కళ్యాణార్థం గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల శ్రీ మార్కండేయ శివాలయం ఆవరణలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి రోజున మార్కండేయుడి సన్నిధిలో జరిగే ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు చిగురాల రాఘవాచార్యులు మంత్రోచ్చారణల మధ్య రక్షాబంధన, యజ్ఞోపవీత దారణ, గణపతి, నవగ్రహ, మార్కండేయ పూజలతోపాటు మృత్యుంజయ హోమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మశాలీ కులస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంచికట్ల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, వంగ వీరస్వామి, రాజమల్లు, గడ్డం జానకీరాం, కానుగంటి నారాయణ, పోరండ్ల కొమురయ్య, ఆర్ఎస్ మూర్తి, మాటేటి సతీష్, బొద్దుల వేణు, గడ్డం సత్యనారాయణ, అడిచర్ల నంబయ్య, గోసిక సత్యం, నాగేశ్వరరావుతోపాటు అధిక సంఖ్యలో పద్మశాలీలు పాల్గొన్నారు.

# గనులశాఖలో అవినీతి మేట

**లెక్కకు మిక్కిలిగా జయరాజ్ ఆస్తులు**

**రిమాండ్‌కు ఆదేశించిన ఎసిబి కోర్టు**

**14 రోజులు రిమాండ్‌కు వరంగల్ జైలుకు తరలింపు**

వరంగల్: ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. కోర్టులో హాజరు పర్చగా ఆదేశాలతో వరంగల్ జైలుకు తరలించారు. జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జయరాజ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో దాడులు చేపట్టినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. జయరాజ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ గతంలోనే గనుల శాఖ అధికారులు హెచ్చరించారు కూడా. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ తీరులో మార్పు రాలేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో జయరాజ్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందడంతో దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని జయరాజ్ నివాసంతో పాటు ఆయన స్నేహితులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఏసీబీ లెక్కల ప్రకారం జయరాజ్‌కు సంబంధించిన సుమారు రూ.65 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, తూప్రాన్, తుంగతుర్తి, సూర్యాపేటలో ఒక్కో ఎ÷-లాట్, కీసరలో రెండు ఇంటి స్థలాలు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. కేపీహెచ్‌బీలో విలువైన మరో ఎ÷-లాట్‌ను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే సుమారు రూ.20 లక్షల విలువైన ఎల్ఐసీ బాండ్లు, రూ.20 లక్షలకు పైగా పోస్టాఫీస్ సేవింగ్స్, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71 లక్షల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు సుమారు రూ.40 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 629 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

# జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయండి

## మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాదయాత్ర

కామారెడ్డి: జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలపై జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి మండలంలోని మహ్మదాబాద్ చౌరస్తా నుండి జుక్కల్ చౌరస్తా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను సైతం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిద్రపోతోందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2015-16లో రహదారిని వెడల్పు చేసి బీటీ రోడ్డు నిర్మించామని, రోడ్డు మరమ్మతులకు రావడంతో తమ ప్రభుత్వ హయాంలో రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల కోసం,అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర కొనసాగుతోందని ఆయన చెప్పారు.

# విద్యార్థులకు సకాలంలో బ్యాంక్ ఖాతాలు

నిర్మల్: విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సకాలంలో వారి ఖాతాల్లో జమా అయ్యేలా బ్యాంకు ఖాతాల ప్రారంభ పక్రియను వేగవంతం చేయాలని లీడ్ బ్యాంక్ డిస్టిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ బ్యాంకర్లకు సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించిన ఖానాపూర్ ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం శుక్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రైతు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల పునరుద్ధరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెస్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, ముద్రా, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాల అమలు, వాటికి సంబంధించిన సాంకేతిక మద్దతు విధానాలను బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులకు వివరించారు

# సర్ నోటీసులపై పంచాయితీల్లో విచారణ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా దస్తూరాబాద్ మండలంలో సర్ పక్రియలో భాగంగా నోటీసులు అందిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ యాదవ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విచారణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన విచారణ తేదీన ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ సూచించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. మండలంలో మ్యాపింగ్ కాని ఓటర్లు 372 మంది ఉండగా, పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉన్న ఓటర్లు 2,976 మంది ఉన్నట్లు తహసీల్దా ర్ వివరించారు. మొత్తం 3,348 మంది ఓటర్లకు నోటీసులు అందజేయ నున్నట్లు తెలిపారు. ఓటర్లు నిర్ణీత గడువులోగా విచారణకు హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.

# రాఖీ పండగతో వాహనాల రద్దీ

## వేములవాడలో ట్రాఫిక్ జామ్

వేములవాడ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): వేములవాడ పట్టణంలోని బస్టాండ్ వద్ద వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం రక్షాబంధన్ వేడుకల సందర్భంగా ఇతర పట్టణాలు గ్రామాల నుండి వేములవాడకు చేరే కరీంనగర్, నంది కమాన్ రహదారులతోపాటు తిరిగి వెళ్లేందుకు మూలవాగు వంతెన పై సైతం వాహనాల రద్దీ నెలకొంది. రెండవ బైపాస్ రహదారి పార్క్ నుండి మొదలుకొని తిప్పాపూర్ బస్టాండ్ వరకు వాహనాలు ఒకదానిని ఆనుకొని మరొకటి మెల్లిగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.




క్రైమ్ మిర్రర్

తెలంగాణ

శనివారం

29-8-2026





# పవన్ సోదర ప్రేమ!

పట్టుచీరలతో పాటు నూలు వస్త్రాలను అందించారు. దాదాపు నియోజకవర్గంలో 2439 మందికి పైగా వితంతు మహిళలు, 45 సంవత్సరాల లోపు ఉన్నవారికి తన తోబుట్టువులుగా భావించి చీరలను అందించారు. నిజంగా ఇది గొప్ప విషయం. గతంలో కూడా ప్రత్యేక పర్వదినాల్లో పిఠాపురం మహిళలకు పెద్ద ఎత్తున చీరలను పంపిణీ చేశారు పవన్. రక్షాబంధన్ సందర్భంగా మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నారు. తోబుట్టువులుగా భావించి వేలాదిమందికి చీరలను అందించారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

గొల్లప్రోలు మున్సిపల్ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ కళ్యాణ్ సొంత డబ్బులతో అందించిన పట్టు వస్త్రాలతో పాటు నూలు చీరలను కమిషనర్ మహిళలకు అందజేశారు. పవన్ కళ్యాణ్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మహిళలు ఎంతగానో ఆనందించారు. తమను తోబుట్టువులుగా భావించి చీరలు అందించినందుకు పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కేరళలో ప్రకృతి వైద్యం పొందుతున్నారు పవన్ కళ్యాణ్. ఆయన వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు మహిళలు.

**గతంలో అనేకసార్లు..**

గతంలో శ్రావణమాసం సందర్భంగా మెగా బ్రదర్ నాగబాబు సతీమణి చేతుల మీదుగా వేలాదిమందికి చీరలు అందించారు. ప్రత్యేక పర్వదినాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఒక్క పిఠాపురం మాత్రమే కాదు గిరిజన ప్రాంతాల విషయంలో కూడా పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ అంతా ఇంతా కాదు. గతంలో ఓ గిరిజన గ్రామ ప్రజలు చెప్పులు లేకుండా ఉండడాన్ని చూసి వేలాది జతలను పంపించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గిరిజన మహిళలకు పండగ పూట చీరలు పంపించి వారి ఆనందానికి కారణమయ్యారు. తన సొంత వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఫలాలను సైతం పంపించి వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పుడు ఏకంగా పిఠాపురం నియోజకవర్గంలో వేలాదిమందికి చీరలు పంపించి తోబుట్టువుగా మారారు రక్షాబంధన్ నాడు.

# పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది

(మొదటి పేజీ తరువాయి)

ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ ఫోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారని ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు. హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా

చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

## బాలిక ఆరోగ్యంపై మంత్రి ఆరా

### ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం ఆ బాలిక ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆ బాలిక ఆరోగ్యపరిస్థితిని పర్యవేక్షించడం తోపాటు కుటుంబ సభ్యుల బాగోగులను కూడా తెలుసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

### ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.

## గోదావరిఖనిలో మృత్యుంజయ హోమం

గోదావరిఖని: రాఖీ పూర్ణిమ పర్వదినం పురస్కరించుకొని లోక కల్యాణార్థం గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల శ్రీ మార్కండేయ శివాలయం ఆవరణలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి రోజున మార్కండేయుడి సన్నిధిలో జరిగే ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు చిగురాల రాఘవాచార్యులు మంత్రోచ్చారణల మధ్య రక్షాబంధన, యజ్ఞోపవీత దారణ, గణపతి, నవగ్రహ, మార్కండేయ పూజలతోపాటు మృత్యుంజయ హోమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మశాలీ కులస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంచికట్ల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, వంగ వీరస్వామి, రాజమల్లు, గడ్డం జానకీరాం, కానుగంటి నారాయణ, పోరండ్ల కొమురయ్య, ఆర్ఎస్ మూర్తి, మాటేటి సతీష్, బొద్దుల వేణు, గడ్డం సత్యనారాయణ, అడిచర్ల నంబయ్య, గోసిక సత్యం, నాగేశ్వరరావుతోపాటు అధిక సంఖ్యలో పద్మశాలీలు పాల్గొన్నారు.

# కర్ణాటకలో సంక్షోభం!

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం. డీకే శివకుమార్ క్యాబినెట్లో కీలక మంత్రిగా ఉన్న బి.నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్ తెగల అభివృద్ధి సంస్థలో భారీ అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ప్రతిపక్షాల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి రావడం, న్యాయపరమైన దర్యాప్తు వేగవంతం కావడంతో ఆయన క్యాబినెట్ నుంచి వైదొలగక తప్పలేదు. గత కొద్దిరోజులుగా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన ప్రభుత్వంతో పాటు పార్టీకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రాజీనామా నిర్ణయాన్ని వెల్లడించారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయస్థాయిలో ఇప్పుడు ఇదే చర్చకు దారితీసింది. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్న సంకేతాలు ఒకవైపు.. దేశవ్యాప్తంగా బిజెపి గ్రాఫ్ తగ్గుతుందన్న పరిణామాల నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మంత్రి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**భారీగా అవినీతి ఆరోపణలు..**

కర్ణాటకలో వాల్మీకి కార్పొరేషన్ కు చెందిన 89 కోట్ల నిధులను నకిలీ పత్రాలు, అనధికారిక బ్యాంకు లావాదేవీల ద్వారా అక్రమంగా వివిధ ప్రైవేట్ ఖాతాల్లోకి మళ్లించారు అనేది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంలో ఇప్పటికే అదే కార్పొరేషన్ అధికారి ఒకరు ఆత్మహత్యకు పాల్పడుతూ ఒక లేఖ రాశారు. దీంతో ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అనంతరం కేంద్ర దర్యాప్తు సంస్థ, ఈడీ రంగంలోకి దిగింది. నిధుల మళ్లింపు, మనీలాండరింగ్ కోణంలో విచారణ చేపట్టింది. ఈ క్రమంలో మంత్రి నాగేంద్ర పై ప్రాసిక్యూషన్ అనుమతి కోరడం, చార్జ్ షీట్ లలో పేర్లు ప్రస్తావనకు రావడంతో వివాదం మరింత ముదిరింది.

**అధికార బదలాయింపు కొద్ది రోజులకే..**

ఇటీవల సిద్ధరామయ్య నుంచి డీకే శివకుమార్ అధికార బదలాయింపు జరిగింది. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ వ్యవహరిస్తున్నారు. అయితే తాజా వివాదం నేపథ్యంలో మంత్రి నాగేంద్ర ను తక్షణమే క్యాబినెట్ నుంచి తొలగించాలని ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారతీయ జనతా పార్టీతో పాటు జేడీఎస్ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు రాష్ట్రవ్యాప్త పాదయాత్రలకు కూడా పిలుపు నిచ్చాయి. ఈ హఠాత్ పరిణామాలతో కాంగ్రెస్ స్థాయి కమాండ్ రంగంలోకి దిగింది. ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలగకుండా దిద్దుబాటు చర్యలకు దిగింది. నాగేంద్ర చేత రాజీనామా చేయించడమే ఉత్తమమని రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసింది. న్యాయపరమైన ప్రక్రియలు పూర్తయి.. నిర్దోషిగా బయటపడిన తర్వాత తిరిగి గౌరవప్రదంగా ప్రజల్లోకి వస్తానని మంత్రి పదవికి రాజీనామా చేసిన నాగేంద్ర స్పష్టం చేయడం విశేషం.

## జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయండి

### మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాదయాత్ర

కామారెడ్డి: జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలపై జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి మండలంలోని మహ్మదాబాద్ చౌరస్తా నుండి జుక్కల్ చౌరస్తా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను సైతం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిద్రపోతోందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2015-16లో రహదారిని వెడల్పు చేసి బీటీ రోడ్డు నిర్మించామని, రోడ్డు మరమ్మతులకు రావడంతో తమ ప్రభుత్వ హయాంలో రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల కోసం,అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర కొనసాగుతోందని ఆయన చెప్పారు.

## విద్యార్థులకు సకాలంలో బ్యాంక్ ఖాతాలు

నిర్మల్: విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సకాలంలో వారి ఖాతాల్లో జమా అయ్యేలా బ్యాంకు ఖాతాల ప్రారంభ ప్రక్రియను వేగవంతం చేయాలని లీడ్ బ్యాంక్ డిస్టిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ బ్యాంకర్లకు సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించిన ఖానాపూర్ ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం శుక్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రైతు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల పునరుద్ధరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెస్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, ముద్రా, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాల అమలు, వాటికి సంబంధించిన సాంకేతిక మద్దతు విధానాలను బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులకు వివరించారు

## సర్ నోటీసులపై పంచాయితీల్లో విచారణ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా దస్తూరాబాద్ మండలంలో సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ యాదవ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విచారణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన విచారణ తేదీన ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ సూచించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. మండలంలో మ్యాపింగ్ కాని ఓటర్లు 372 మంది ఉండగా, పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉన్న ఓటర్లు 2,976 మంది ఉన్నట్లు తహసీల్దా ర్ వివరించారు. మొత్తం 3,348 మంది ఓటర్లకు నోటీసులు అందజేయ నున్నట్లు తెలిపారు. ఓటర్లు నిర్ణీత గడువులోగా విచారణకు హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.

## రాఖీ పండగతో వాహనాల రద్దీ

### వేములవాడలో ట్రాఫిక్ జామ్

వేములవాడ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): వేములవాడ పట్టణంలోని బస్టాండ్ వద్ద వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం రక్షాబంధన్ వేడుకల సందర్భంగా ఇతర పట్టణాలు గ్రామాల నుండి వేములవాడకు చేరే కరీంనగర్, నంది కమాన్ రహదారులతోపాటు తిరిగి వెళ్లేందుకు మూలవాగు వంతెన పై సైతం వాహనాల రద్దీ నెలకొంది. రెండవ బైపాస్ రహదారి పార్క్ నుండి మొదలుకొని తిప్పాపూర్ బస్టాండ్ వరకు వాహనాలు ఒకదానిని ఆనుకొని మరొకటి మెల్లిగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

# ఎడిటోరియల్

4

శనివారం

29-8-2026

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్దం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి.

దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే ప్రక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ఫ్రీ డయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా

## ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిల్ళ వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పలు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పుడు ప్రలే నిలదీయాలి. అప్పుడైనా చలనం వస్తుందేమో చూడాలి.

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటు కొత్తేమీ కాదు.. ఇవే మొదలు కాదు..ఇవే చివరికి కూడా కావు. అధికారం ఉంటే ఒక రకమైన కొట్లాట ఉంటుంది. లేకుంటే మరో రకమైన కొట్లాట ఉంటుంది. ఇవన్నీ కూడా ఆధిపత్యపోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరంటే ఒకరికి గిట్టదు. ప్రజల పేరు చెప్పి, పథకాల పేరు చెప్పి డంబాచారాలు ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరు కూడా సమయం వెచ్చించి ప్రజా సమస్యలపై మాట్లాడరు.



## కాంగ్రెస్‌లో కలుపు మొక్కలు !

తాజా పరిణామాలను పరిశీలిస్తే...రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నది ముమ్మాటికి నిజం. రేవంత్ టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి రావడం అన్నదే వారు చూసారు తప్ప కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చారన్న నిజాన్ని పట్టించుకోరు. అందుకే అడపాదడపా వారు నోరు పారేసుకుంటారు. మేమున్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రిగా కొండా సురేఖ పెద్దగా పొడించిందేమీ లేదు. దేవాదాయశాఖలో ఎన్ని గుళ్లల ఉన్నాయో, ఎంతమంది పూజారులు ఉన్నారో, ఎలాంటి పూజాదిక వ్యవస్థ మనదగ్గర ఉందో ఆమెకు తెలియదు. బ్రోచర్లు విడుదల చేయడం, బోనాలెత్తడం తప్ప ఈ మూడేళ్లలో ఆమె చేసింది శూన్యం. దేవాలయాలు కునారిల్లుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు అందడం లేదు. అన్యాక్రాంతం అయిన భూముల్లో ఇంచు భూమి కూడా ఆమె వెనక్కి తీసుకోలేదు. గ్రామాల్లో దేవాలయాల భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి, కొందరు ఏకంగా పట్టాలు చేసుకున్నారు. ఉమ్మడి వరగంల్ జిల్లాలోనే ఇలా వందలాది ఎకరాలు ఉంటాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి దేవాలయ భూములు కౌలు చేస్తున్నవారే పట్టాలు చేయించుకున్నారు. జీడికల్ భూములు, కొండాపూరం భూములు, ఇలా చెప్పుకుంటూ పోతే ఊరికో చరిత్ర ఉంది. ఆమె ఏనాడూ ఈ భూముల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ మంత్రిగా అసలు ఒక్క మొక్కయినా నాటి పెంచారా అన్న అనుమానం కలుగుతుంది. ఎపిలో పవన్ కళ్యాణ్ సామాజిక వనాల పెంపునకు పాల్పడుతుంటే ఇక్కడ కనీసం వరమహోత్సవాలు లేవు. ఉన్నా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇవన్నీ వదిలేసి కూతురుతో సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించి, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా మాట్లాడడం వారికే చెల్లింది. నిజానికి ఆమె దేవాలయాలను పట్టించుకుని, అడవులను పట్టించుకుని ఉంటే జనం ఆమె అంటే అభిమానం చూపేవారు. కానీ కూతరు రాజకీయం ముఖ్యం. రాజకీయాలు తప్ప ప్రజల సేవ ముఖ్యం కాదు. ఇక చిన్నరెడ్డి కూడా అంతే. ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ప్రజావాణిలో వచ్చిన అనేక ముఖ్యమైన సమస్యలు ఏమిటో వాటిని ఎలా పిరిష్కరించారో చెప్పలేరు. రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి కావాలి. ఆయన జీవిత ధ్యేయం అదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌లో డ్రామాలు నడుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ దశదిశా లేకుండా వ్యవహరించింది. కెసిఆర్‌ను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు. అందుకే అధికారం లోకి రావడానికి తొమ్మిదిన్నరేళ్లు పట్టింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీని చూసి ఓటేయలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల అవినీతి కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు. నిజానికి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఎదిగిన అవకాశం ఉమ్మడి ఎపిలో ఒక్క రాజశేఖర్ రెడ్డికే సొంతం. ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లు పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదగలేక పోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ సంస్కృతిలో భాగమని ఊరుకోక తప్పదు. ఎందుకంటే కొండాసురేఖ,చిన్నారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం కాంగ్రెస్ నేతలు చేయరు. నిజంగానే వీరిద్దరిని పీకి అవతల పడేస్తే కాంగ్రెస్‌లో చురుకు పుడుతుంది. కాంగ్రెస్ బలం పెరుగుతుంది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడితే ఏమయ్యింది. వీరు పోయినా ఏమీ కాదు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అంతర్గత కుమ్ములాటలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఏవగింపు ఏర్పడింది. బిఆర్స్‌ను మించి పాలన సాగిస్తారని అనుకుంటే మంత్రులలంతా పర్సంటేజీల ఖాతాలు తెరిచారు. గ్రామస్థాయిలో అవినీతి మరింత పెరిగింది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టడం భరిస్తూ పోతే వీరి జాబితా పెరగడమే తప్ప తగ్గదని గురించాలి. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కిక్కురుమనకుండా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం తలలు ఎగరేస్తున్నారు. ఈ ఇద్దరు నేతు ఏ పార్టీలోకైనా వెళ్లి రాగలరని ఇప్పటికే రుజువయ్యింది. బిఆర్ఎస్ పాలనను నిలదీస్తూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీటుగా ఎదుర్కొనే సత్తా రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉందన్న నమ్మకంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తొలగించడం రేవంత్‌రెడ్డికి కలిసొచ్చింది. కేసీఆర్ పోకడల పట్ల విముఖంగా ఉన్న ప్రజలు ప్రత్యామ్నాయ నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎంచుకున్నారే తప్ప కాంగ్రెస్‌పైనో లేదా రాహుల్‌పైనో ప్రేమతో కాదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎవరన్న ప్రశ్న ఉదయించినప్పుడు, తాను ఉన్నానన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం దక్కాక ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో మంత్రులదీ పెద్ద పాత్రే ఉంది. అయితే పాత కాంగ్రెస్ సంస్కృతిని మరవకపోవడంతో పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పింది. వీరివల్ల ఎన్నుకున్న ప్రజలకు రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్న ప్రచారం బాగా వ్యాప్తి చెందుతున్న వేళ కొండా సురేఖ లాంటి వారి చర్యలు కాంగ్రెస్‌కు బలహీనతే తప్ప బలం కాదు. వీరిని వదిలించుకుంటే తప్ప మేలు జరగదు. కాంగ్రెస్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## సింగరేణి కార్మికుల సమస్యలపై ఒప్పంద

**సమ్మె నోటీసుతో యాజామన్యం చర్చలు**

**పలు అంశాల పరిష్కారానికి దక్కిన హామీ**

కొత్తగూడెం): సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాటం కీలక విజయాన్ని సాధించింది. ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు ప్రభావంతో సింగరేణి యాజమాన్యం దిగివచ్చి కార్మికుల పలు ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించింది. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్‌ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు జరిగిన చర్చల అనంతరం జరిగిన కీలక చర్చల్లో యాజమాన్యం పలు అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంది. అనంతరం కేంద్ర కార్మిక ప్రాంతీయ కమిషనర్ కార్యాలయంలో ఏఎల్‌సీ శాశ్వతిరెడ్డి సమక్షంలో యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు ఒప్పందాలు చేసుకున్నారు. 23 కీలక అంశాలపై అంగీకారం తెలిపారు. కోల్ ఇండియాలో అమలవుతున్న విధానానికి అనుగుణంగా కార్మికులకు లభించే అలవెన్సులు, పెర్క్‌పై విధించే ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించేందుకు అంగీకరించింది. సర్వీసులో ఉండగానే సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షలు అందించే అంశానికి యాజమాన్యం అంగీకరించింది. కార్మికుల వైద్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నెలనెలా మెడికల్ బోర్డు నిర్వహించనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకుని చర్యలు చేపట్టనున్నారు. మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధనను తొలగించి, ఖాళీల ఆధారంగా ఒక సంవత్సరం నిబంధనతో ట్రాన్స్‌ఫర్లు చేపట్టేందుకు అంగీకరించారు. అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు సకాలంలో ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లు కల్పించనున్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు కమిటీ ఏర్పాటు చేసి, అందులో యూనియన్ సంఘాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. దాదాపు 22 ఏళ్లుగా మార్పులేని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సవరించేందుకు అంగీకరించారు. సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీ సేవలతో పాటు వారం రోజుల వరకు చికిత్స అందించేలా చర్యలు చేపట్టనున్నారు. సింగరేణి విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో అ:÷ూఇ సిలబస్ అమలుపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. గనుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన సేఫ్టీ మెటీరియల్‌ను సకాలంలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిస్మిస్ కేసులను కమిటీ ద్వారా పరిష్కరించేందుకు అంగీకరించారు. మెకానికల్, ఎలక్ట్రికల్, అండర్‌గ్రౌండ్ మైనింగ్ విభాగాల్లో జనరల్ అసిస్టెంట్లుగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిశీలించి అర్హతలకు అనుగుణంగా సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ వైద్య సదుపాయం అందేలా చర్యలు చేపట్టనున్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అంగీకరించారు. ఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే ఈ కీలక నిర్ణయాలు సాధ్యమయ్యాయని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

## రక్షణ రంగంలో మరో ముందడుగు

అమెరికాతో రక్షణ శాఖ జావెలిన్ కొనుగోళ్లు

న్యూఢిల్లీ: భారత్ - అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ పక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. భారత్‌లో జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. క్షిపణులను ప్రయోగించిన తర్వాత మళ్లీ గైడ్ చేయక్కర్లేని 'ఫైర్ అండ్ పర్గెట్' ఆటోమేటిక్ టెక్నాలజీతో జావెలిన్ మిస్సైళ్లు పనిచేస్తాయని వివరించారు. శత్రు దేశాల ట్యాంకులు, బంకర్లకు చెక్ పెట్టేలా భయానక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని చెప్పుకొచ్చారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో శత్రువుల ట్యాంకులు, బంకర్లు, సాయుధ వాహనాలను ధ్వంసం చేయడంలో ఈ ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్

**విశాఖ కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్ దక్కింది. ముంబై, చెన్నై తర్వాత దేశంలో మూడో అతిపెద్ద డిజిటల్ ల్యాండింగ్ హబ్‌గా ఏపీ అవతరించనుంది. సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ నిర్మాణంలో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు భాగస్వామ్యం కానున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో పాటు ఎఐ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. మైక్రోసాఫ్ట్, లైట్‌స్టార్మ్, సింగ్‌టెల్ భాగస్వామ్యంతో సుమారు 3,600 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేబుల్ ద్వారా విశాఖపట్నానికి సింగపూర్, ఆగ్నేయాసియా ప్రాంతాలతో నేరుగా కనెక్టివిటీ ఏర్పడనుంది. 2029 ఆఖరు నాటికి మైక్రోసాఫ్ట్-లైట్‌స్టార్మ్ సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. మచిలీపట్నం-హైదరాబాద్-ముంబై, చెన్నై-హైదరాబాద్-ముంబై మార్గాల్లో కొత్త అంతర్గత డిజిటల్ ÷బైర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీంతో విశాఖపట్నం అంతర్జాతీయ డిజిటల్ గేట్‌వేగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ 'అమెరికా-ఇండియా కనెక్ట్' సబ్‌సీ కేబుల్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖ గూగుల్ సెంటర్‌లో పవర్-హంగ్రీ ఎఐ మోడల్స్ కంటే ఎఐ ఇన్ఫరెన్సింగ్, క్లౌడ్ సేవలకే మొగ్గు చూపనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశాఖ ఫెసిలిటీలో పునరుత్పాదక విద్యుత్, ఎయిర్ కూలింగ్ టెక్నాలజీలను గూగుల్ ఉపయోగించుకునే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న రాజకీయ అశాంతి నేపథ్యంలో సురక్షిత డిజిటల్ కారిడార్‌గా భారత తూర్పు తీరం

# కోతుల దాడులకు అడ్డుకట్టేదీ?

## రామకృష్ణాపూర్‌లో వృద్ధురాలిపై దాడి..తీవ్ర గాయాలు

## రూ.5 లక్షలు కేటాయించినా చర్యలు శూన్యం

## భయాందోళనలో క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు





**రామకృష్ణాపూర్ ఆగస్టు 28(క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకూ మితిమీరిపోతోంది. నివాస ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కోతులు బాటసారులు, ఇళ్ల ముందున్న ప్రజలపై దాడులకు తెగబడుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా రామకృష్ణాపూర్ సింగరేణి స్టేడియం సమీపంలో ఓ వృద్ధురాలిపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేడియం సమీపంలో నివాసముంటున్న గండమల్ల భాగ్యమ్మపై శుక్రవారం సాయంత్రం కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో ఆమె తీవ్రంగా గాయపడటంతో, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ అత్యవసర చికిత్స పొందుతున్నారు.

**వరస దాడులతో వణుకుతున్న జనం**

ఈ ప్రాంతంలో కోతుల బెడద తీవ్రస్థాయికి చేరిందని, నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన నాయకుడిపై కూడా కోతులు దాడి చేసి గాయపరిచిన ఘటన చోటుచేసుకుంది. తాజాగా వృద్ధురాలిపై దాడి జరగడంతో సమస్య తీవ్రత మరోసారి వెలుగులోకి వచ్చింది. వీధుల్లో చిన్నారులు ఆడుకోవాలన్నా, వృద్ధులు బయటకు రావాలన్నా భయంతో వణికిపోయే పరిస్థితి నెలకొంది.

**రూ.5 లక్షలు మంజూరైన... కోతుల బెడదకు అడ్డు కట్టేది**

కోతుల రవాణా, నివారణ చర్యల కోసం మున్సిపల్ పాలకవర్గం తమ తొలి సమావేశంలోనే రూ.5 లక్షల నిధులను కేటాయించినట్లు సమాచారం. అయితే నిధులు మంజూరై నెలలు గడుస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం కోతులను పట్టించేందుకు ఎలాంటి ముందడుగు వేయలేదు. ప్రజాప్రతినిధుల నుంచి సామాన్య ప్రజల వరకు కోతుల దాడులకు గురవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, కేటాయించిన నిధులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కోతులను పట్టించి అటవీ ప్రాంతాలకు తరలించాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి సెప్టెంబర్ 13న శంకుస్థాపన

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి తదితరులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేందుకు ముహూర్తం ఖరారైంది. శంకుస్థాపనకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమయం కేటాయించారు. సెప్టెంబర్ 13న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించినట్లు మహాసభ నాయకులు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని కలిసి శంకుస్థాపన కార్యక్రమానికి సమయం కోరగా, ఆయన వెంటనే స్పందించి సెప్టెంబర్ 13న సమయం కేటాయించారని పేర్కొన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి ఆర్యవైశ్య మహాసభ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, కోశాధికారి రేణుకుంట్ల గణేష్‌గుప్త, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, ఉప్పల్ భగాయత్ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ పలబట్ల ఆనంద్‌బాబు తదితరులు ఉన్నారు. ఐదు ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఈ భవనం ఆర్యవైశ్య సమాజానికి వివిధ కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నట్లు నాయకులు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## అన్నా--చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు

### బీజేపీ రాష్ట్ర నాయకురాలు అన్నపురెడ్డి స్వర్ణలత

### బీమా అర్జున్‌రెడ్డి కుటుంబంలో సందడి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అన్నా--చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను రాజేంద్రనగర్ కిస్మత్‌పూర్ 122వ డివిజన్‌లో కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు అన్నపురెడ్డి స్వర్ణలత--బీమా అర్జున్‌రెడ్డి దంపతుల కుటుంబ సభ్యులు రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెల్లెలు తన అన్న రాహుల్‌రెడ్డికి రాఖీ కట్టి, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసింది. అన్నా--చెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగానికి ప్రతీకగా రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ వేడుక ఆత్మీయత, ఆనందంతో సాగింది. రాఖీ పండుగ అన్నా--చెల్లెళ్ల బంధాన్ని మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ అని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## మణికొండలో వాక్ విత్ హైడ్రాకు సన్నాహాలు

### మన మణికొండ--మన బాధ్యత సందేశంతో ఆదివారం కార్యక్రమం


**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా మణికొండలో 'వాక్ విత్ హైడ్రా--వీ సపోర్ట్ హైడ్రా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివిధ కాలనీల రెసిడెంట్స్ తెలిపారు. 127-మణికొండ డివిజన్ పరిధిలోని కాలనీల రెసిడెంట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 7.30 గంటలకు మణికొండ మర్రిచెట్టు వద్ద వాక్ ప్రారంభమై హుడా కాలనీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కాలనీలకు చెందిన రెసిడెంట్స్‌తో పాటు మార్నింగ్ వాకర్స్, యువత, మహిళలు, సీనియర్ సిటిజన్స్ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మణికొండలో పర్యావరణ పరిరక్షణ, చెరువులు--నాళాల సంరక్షణ, ఆక్రమణల నియంత్రణతో పాటు ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు చేపట్టే చర్యల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. మన మణికొండ--మన బాధ్యత అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ వాక్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రజా ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే కార్యక్రమాలకు తమ సంఘీభావాన్ని తెలియజేయడమే లక్ష్యమని తెలిపారు. మణికొండ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ వాక్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



## రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాఖీ పౌర్ణమి సందర్భంగా రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డిని బ్రహ్మకుమారీలు మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను వివరించి శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, ఆత్మీయతకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మకుమారీలు జోనల్ కమిషనర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి బ్రహ్మకుమారీలకు కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగ ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# సర్వేల్లో కాంగ్రెస్ జోష్.. కొత్త సారథిగా వినోద్ గౌడ్!

### గ్రామ శాఖ అధ్యక్షుడిగా వీరమళ్ల వినోద్ కుమార్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక..

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పబ్బతి ఆకాష్ గౌడ్



**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం :** సర్వేలు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి నూతన సారథ్యం లభించింది. గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడిగా వీరమళ్ల వినోద్ కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సర్పంచ్ చిలకరాజు చందన రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వినోద్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఆమోదించారు. అదే సమావేశంలో యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా పబ్బతి ఆకాష్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులను పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

**కష్టకాలంలో పార్టీకి అండగా..**

2012 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్న వీరమళ్ల వినోద్ కుమార్ గౌడ్.. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్‌ను వీడకుండా నమ్మకంగా పనిచేశారు. తన సేవలను గుర్తించి గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో తనకు ఈ బాధ్యత దక్కిందని వినోద్ గౌడ్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సర్వేలు కాంగ్రెస్ పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ దేవాలయ చైర్మన్లు, వార్డు సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

### నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై సీఎంతో చర్చ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు నియోజకవర్గ సీనియర్ నాయకులు గణేష్ కూడా ముఖ్యమంత్రిని కలిశారు. ఈ భేటీ మర్యాదపూర్వకంగా సాగినప్పటికీ, నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు తదితర అంశాలపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే చర్చించినట్లు తెలిసింది. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వర్గాలు తెలిపాయి. ఈ భేటీతో స్థానికంగా రాజకీయ, అభివృద్ధి వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption



# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

## నార్సింగి పరిధిలోని నాలుగు చెరువుల వద్ద ఏర్పాట్లపై అధికారుల చర్చ

గండిపేట(క్రైమ్ మిర్రర్): రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా, సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది. సమావేశానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, హైడ్రా తో పాటు నార్సింగి సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. ప్రధానంగా నెక్నాంపూర్ బేబీ పాండ్, సంజీవరెడ్డి పాండ్--మంచిరేవుల, కొత్త చెరువు--కోకాపేట్, జన్వాడ చెరువు వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, రద్దీ నిర్వహణ తదితర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి




అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించి, వాటిని పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. గణేష్ నిమజ్జన సందర్భంగా ప్రజలకు, భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.



## మణికొండలో ఘనంగా సామూహిక యజ్ఞోపవీత ధారణ

### గాయత్రీమాత పూజ అనంతరం సామూహికంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పద్మశాలి సామాజిక వర్గ ఆరాధ్య దైవమైన శ్రీ భావనా ఋషిని స్మరించుకుంటూ మణికొండ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పంచవటి కాలనీలోని శ్రీ లలితా సమేత కామేశ్వర ఆలయంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని పద్మశాలి సమాజంలో జంధ్యాల పౌర్ణమి, నూలి పున్నమిగా పిలుచుకుంటారని నిర్వాహకులు తెలిపారు. శ్రీ భావనా ఋషి జగత్కల్యాణం కోసం శ్రీ మహావిష్ణువు నాభి కమలం నుంచి నూలు పోగులతో వస్త్రాన్ని నేసినట్లు పద్మశాలి సంప్రదాయంలో విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఈ పౌర్ణమి పద్మశాలీల నూలు పుట్టుకకు నాందిగా భావిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వేద సంప్రదాయాల ప్రకారం గాయత్రీ మంత్రాన్ని పఠిస్తూ కొత్త జంధ్యం (యజ్ఞోపవీతం) ధరించే ఉపాకర్మ కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహించారు. భక్తులు, పద్మశాలి సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పారంపర్య ఆచారాలను కొనసాగిస్తూ, ఆధ్యాత్మిక భావనను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా ముగిసింది.

## భాజపా ఆధ్వర్యంలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** భారతీయ జనతా పార్టీ పాలకీడు మండల శాఖ ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మహిళా మోర్చా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం మహిళ నాయకురాలు కొమ్మగాని అచ్చమ్మ ఆధ్వర్యంలో కస్తూర్బా గురుకుల పాఠశాల టీచింగ్ , నాన్ టీచింగ్ స్టాఫ్ లతో రక్షబంధన్ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ. . రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్ల బంధానికి పరిమితం కాకుండా, సమాజంలో పరస్పర ప్రేమ, సామరస్యం, రక్షణ భావాలను పెంపొందించే పండుగ అని అన్నారు. విద్యార్థి దశ నుంచే భారతీయ సంస్కృతి, నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు నరి నాయక్ , పాలకీడు బూత్ అధ్యక్షులు కొండ శీను, నాయకులు ,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## సర్వేల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా వీరమల్ల వినోద్ గౌడ్ ఎన్నిక



**సంస్థాన్ నారాయణపురం, క్రైమ్ మిర్రర్:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరిగింది . సర్వేలు సర్పంచ్ చిలకరాజు చందన రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వీరమల్ల వినోద్ గౌడ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పబ్బతి ఆకాష్ గౌడ్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ దేవాలయ చైర్మన్లు,వార్డ్ మెంబర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది. నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులు సన్మానించడం జరిగింది.

## శంషాబాద్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల గోడపత్రిక విడుదల

### కరీంనగర్‌లో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో మహాసభలు.. భారీగా కార్మికులు తరలిరావాలని పిలుపు




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ 4వ మహాసభలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. కరీంనగర్ పట్టణంలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభల ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి హాజరై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్ర 4వ మహాసభలకు శంషాబాద్ మండల కేంద్రం నుంచి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని నర్రగిరి పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గిలక రాజు, మండల అధ్యక్షుడు శ్రీను, భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎద్దుల శ్రీను, మండల ఉపాధ్యక్షుడు దండు రవితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస..

### బీటెక్ విద్యార్థి అదృశ్యం

### ఇంటి నుంచి రూ.8 వేల నగదుతో బైక్‌పై వెళ్లి తిరిగి రాని వైనం..

### ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపుతోంది. జేబీఐటీ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న యోగినంద (20) ఇంటి నుంచి నగదు తీసుకుని ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. రామకృష్ణ కుమారుడైన యోగినంద బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న అతడు సుమారు రెండేళ్ల క్రితం వాటి కోసం దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అతడిని మందలించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సుమారు నాలుగు నెలల క్రితం యోగినంద తన తల్లి జీతానికి సంబంధించిన రూ.24 వేల నగదును తీసుకున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో అందులో నుంచి రూ.10 వేల నగదును తిరిగి ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆగస్టు 20న సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటి నుంచి మరో రూ.8 వేల నగదును తీసుకుని హోండా షైన్ మోటార్‌సైకిల్‌పై బయటకు వెళ్లాడు. అనంతరం ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి అతడి మొబైల్‌కు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో కుటుంబ సభ్యులు యోగినందకు తెలిసిన వ్యక్తులు, స్నేహితులు, బంధువులను సంప్రదించి ఆరా తీశారు. అయినప్పటికీ అతడి ఆచూకీ లభించకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించారు. తన కుమారుడి ఆచూకీని గుర్తించి సురక్షితంగా ఇంటికి తీసుకురావాలని కోరుతూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి యోగినంద ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. అతడు చివరిసారిగా ఎక్కడికి వెళ్లాడు, ఎవరిని కలిశాడు అనే వివరాలను సేకరిస్తూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ కుమారుడి క్షేమంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అన్న బిచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ

### పట్వారీ శశిధర్ నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**కూకట్ పల్లి, ఆగస్టు 28 (క్రైమ్ మిర్రర్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళా సోదరీమణులతో" కలిసి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ వారి నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరిగాయి. మహిళా సోదరీమణులు రాఖీలు కట్టి వారి ప్రేమాభిమానాలు చాటుకున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరై పట్వారీ శశిధర్ ని ఆత్మీయంగా కలిసి రాఖీలు కట్టి "రాఖీ పౌర్ణమి" శుభాకాంక్షలు తెలిపారు. రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులందరికీ వారు బహుమతి అందజేసి "రాఖీ" పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలతో సోదరభావంతో మమేకమై, వారి ఆప్యాయతను స్వీకరించారు.ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ మాట్లాడుతూ.. సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా "రక్షా బంధన్" నిలుస్తుందని అన్నారు. ప్రతి సోదరి సంతోషంగా, సురక్షితంగా ఉండేలా అండగా నిలబడటం ప్రతి సోదరుడి బాధ్యత అని, రక్షా బంధన్ సందర్భంగా సోదరీమణుల ఆశీస్సులు, ఆత్మీయత తనకు ఎంతో సంతోషాన్ని కలిగించాయని పేర్కొంటూ, ప్రతి కుటుంబంలో ప్రేమ, ఐక్యత, సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మహిళా సోదరీమణులతో రాఖీ పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన మహిళ సోదరిమణులు,డివిజన్ సోదరిమణులు, మహిళ నాయకులు, కార్యకర్తలు,టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తాం

**బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ స్థూపం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నివాళులు !**

**- నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, సి.వై.పుల్లయ్య**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన విద్యుత్ అమరవీరులకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. 2000 సం.లో విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్ బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు వారి 26వ, వర్ధంతి సందర్భంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ అధ్యక్షతన రామకృష్ణ స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎం. ఎల్.) మాస్లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సి.వై. పుల్లయ్య మాట్లాడుతూ, ఆనాడు చంద్రబాబు నాయుడు విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావటానికి ప్రయత్నిస్తే విద్యుత్ రంగం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి, ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఆనాడు 9 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ పోరాటం చేశామన్నారు. ఆనాటి పోరాటం, విద్యుత్ అమరవీరుల త్యాగాల వల్ల రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు క్రాస్ సబ్సిడీని పాలకులు ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల జాబితాలోని విద్యుత్ను లాగేసుకొని సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. జి.ఎస్.టి.తో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిమీద దెబ్బ కొట్టారని వారు విమర్శించారు. 26 ఏండ్లు గడుస్తున్నా ఆనాటి విద్యుత్ పోరాట దృశ్యాలు కండ్ల ముందే మెదలాడుతున్నాయని అన్నారు. ఆనాటి ఘటన యాదృచ్ఛికమైనది కాదని, ప్రభుత్వ విధానాలకు సంబంధించినదని చెప్పారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు



తిరగబడక తప్పదని హెచ్చరించారు. నేడు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. సంస్కరణలు, ఆర్థిక విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత వామపక్ష పార్టీలపై ఉందని, విద్యుత్ అమరవీరుల సాక్షిగా ఆ బాధ్యతను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. విద్యుత్ పోరాటం, ముగ్గురు అమరవీరుల త్యాగాల వల్లే నేటికి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచాలంటే పాలకులు భయపడుతున్నారని వారు తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల ప్రజలపై భారం పడుతోందని అన్నారు. మోడీ ఆర్డినెన్స్ తెచ్చి స్మార్ట్ మీటర్లు దేశంలో, రాష్ట్రంలో ఏర్పాటుచేసి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చాలని చూస్తున్నారని, దానిని ప్రజలంతా తిప్పికొడుతూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా నాయకులు జానీమియా, శింగు నర్సింహారావు, సిపిఎం సీనియర్ నాయకులు పోన్నం వెంకటేశ్వరరావు సిపిఎం రాష్ట్ర



కమిటీ సభ్యులు బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, సిపిఐ జిల్లా నాయకులు పోటు కళావతి, మేకల శ్రీనివాస్, సిహెచ్. సీతామహాలక్ష్మి, సిపిఐ (ఎం.ఎల్.) మాస్లైన్ జిల్లా నాయకులు ఆవుల అశోక్, రామయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి మండలం లో అడ్డగోలుగా అక్రమ రేషన్ కార్డులు

**స్థానికేతర్లకు, ప్రభుత్వం ఉద్యోగం ఉన్న కుటుంబాలకు సైతం రేషన్ కార్డులు**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో అడ్డగోలుగా అక్రమంగా రేషన్ కార్డులు మంజూరు చేశారు. స్థానికంగా నివాసం లేని స్థానిక ఆధార్ కార్డు అడ్రస్ లేకుండా కనీసం స్థానిక ఓటు హక్కు లేకుండా విచ్చలవిడిగా రేషన్ కార్డులు మంజూరు చేశారు. బెంగళూరులో చెన్నై పూణే ఆధార్ అడ్రస్ ఉన్నవారికి హైదరాబాదులో సెటిల్ అయిన వారికి విడాకులు తీసుకోని మరో వ్యక్తిని పెళ్లాడిన వ్యక్తులకు సైతం స్మార్ట్ రేషన్ కార్డులు నేలకొండపల్లి మండలంలో పంపిణీ చేయటం విశేషం. ఒక గ్రామంలో వెయ్యి మంది ఓటర్లు ఉండగా 450 రేషన్ కార్డులు ఉన్నాయి. కొడుకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఉద్యోగాలు చేస్తున్న వారి కుటుంబాలకు సైతం రేషన్ కార్డులు అందించారు. ట్రాక్టర్లు ఉన్నవారికి 20 ఎకరాలు పైగా భూములు ఉన్నవారికి సైతం నేలకొండపల్లి మండలంలో రేషన్ కార్డులు మంజూరు చేయటం విశేషం.




## కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది**

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్**






**కూకట్ పల్లి, ఆగస్టు 28 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మహిళా నాయకురాళ్లు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మహిళలకు రక్షాబంధన్ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. పార్టీలకు అతీతంగా మహిళలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బండి రమేష్ హామీ ఇచ్చారు. రాఖీ కట్టిన మహిళలను ఆత్మీయంగా ఆశీర్వదించిన బండి రమేష్, మహిళలు కుటుంబంతో పాటు సమాజం, రాజకీయాలు, విద్య, ఉద్యోగం, వ్యాపారం తదితర అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ వేళ ఆత్మీయతను పంచుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని మంత్రి సీతక్క , కాంగ్రెస్ మహిళా నాయకులు, బ్రహ్మకుమారీస్ సోదరీమణులు కలిసి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరీమణుల ఆత్మీయతను స్వీకరించి, వారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం సోదరీమణులందరికీ స్వీట్లను పంచి, కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సోదర, సోదరీమణుల బంధాలు కేవలం పుట్టుకతోనే ఏర్పడవని, కాలక్రమంలో మన ప్రయాణంలో ఎన్నో ఆత్మీయ బంధాలు ఏర్పడతాయని వాటిని మరింత బలపరచడానికి రాఖీ పండుగ వేదికవుద్దన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణులంతా తన వద్దకు వచ్చి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని మంత్రి గారు ఆకాంక్షించారు.



## వినాయక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ

**కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేస్తాం: అధ్యక్షులు ప్రభారెడ్డి**

**కూకట్ పల్లి, ఆగష్టు 28 (క్రైమ్ మిర్రర్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కమిటీ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా పాత కమిటీ సభ్యులు నూతన కమిటీకి అసోసియేషన్‌కు సంబంధించిన బాధ్యతలను, నిర్వహణ వ్యవహారాలను సాదరంగా అప్పగించారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో అధ్యక్షురాలు సి ప్రభా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాశం శ్రీనివాస్, కోశాధికారిగా కొండజు సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, నవీన్, శ్రవణ్, మహేష్ తదితరులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినాయక్‌నగర్ కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కాలనీ వాసులందరినీ కలుపుకొని, ప్రతి ఒక్కరి సూచనలు, సలహాలను స్వీకరిస్తూ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా కాలనీలో నెలకొనే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, కాలనీ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నూతన కమిటీ సభ్యులు కోరారు. పాత కమిటీ అందించిన సహకారానికి నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గత కమిటీ చేపట్టిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ మరింత సమర్థవంతమైన నిర్వహణతో వినాయక్‌నగర్‌ను ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## చింతకాని మండలంలో పర్యటించిన మాజీ ఎంపీ నామ

**నూతన వధూవరులకు నామ ఆశీస్సులు**





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం చింతకాని మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా నేరేడ గ్రామ వాస్తవ్యులు నన్నక కోటయ్య కుమారుడు రవితేజ వివాహం బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముత్తం శ్రీనివాసరావు--శిరీష దంపతుల కుమార్తె సింధుతో గురువారం ఉదయం జరిగిన నేపథ్యంలో, నూతన వధూవరుల స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో నామ పాల్గొన్నారు. స్వామివారి ప్రసాదం స్వీకరించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారికి వస్త్రాలను బహూకరించారు.

### నామకు రాఖీలు కట్టిన మహిళలు

అనంతరం ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన పలువురు మహిళలు రాఖీ పండుగ సందర్భంగా నామ నాగేశ్వరరావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు స్వీట్ తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావుతో స్థానికులు ఉత్సాహంగా ఫొటోలు దిగారు.

### గురిజాల హనుమంతరావును పరామర్శించిన నామ


అంతకుముందు చింతకాని మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు ఇటీవల చిన్న శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నామ నాగేశ్వరరావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బాణాల వెంకటేశ్వర్లు, మోరంపూడి ప్రసాదరావు, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, తన్నీరు రవి, బొడ్డు వెంకటరామయ్య, గడ్డం శ్రీనివాసరావు, చాట్ల సురేష్, పోట్ల సీతయ్య, చెవుల ప్రసాద్, సోమా నాగేశ్వరరావు, సామినేని అప్పారావు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, పాల్నిడి కొండలరావు, సరిపూడి గోపి సందేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# ప్రేమకు ప్రతీక... ఆత్మీయతకు చిరునామా...!

## అన్నాచెల్లెల్ల అనుబంధానికి నిదర్శనంగా రక్షాబంధన్ వేడుకలు.....!

## తమ్ముడు నరసింహారెడ్డికి రాఖీ కట్టిన మాజీ మంత్రి , ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన తమ్ముడు నరసింహారెడ్డి నివాసంలో ఆత్మీయంగా రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. తమ్ముడికి తిలకం దిద్ది,చేతికి రాఖీ కట్టారు. అనంతరం తమ్ముడికి స్వీట్ తినిపించారు.ఈ వేడుకలో కుటుంబ సభ్యులు పాల్గొని సందడి చేశారు.

**అన్న చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ మన కుటుంబ విలువలను, ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేస్తుంది అని అన్నారు.ప్రజలకు శుభాకాంక్షలు ఈ పవిత్రమైన రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అక్కాచెల్లెళ్ల జీవితాల్లో అన్నదమ్ముల ప్రేమ, ప్రతి అన్నదమ్ముల జీవితాల్లో అక్కాచెల్లెళ్ల ఆప్యాయత ఎల్లప్పుడూ నిండాలి. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి” అని ఆకాంక్షించారు.

# కల్వకుర్తి ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ):** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింత పెంపొందించే పవిత్రమైన పండుగ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోదరసోదరీమణుల మధ్య అనుబంధం ఎల్లప్పుడూ సంతోషంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని అన్నారు .కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో, కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి రాఖీ కట్టిన మాజీ సర్పంచ్ అక్కి సుశీల

**వనపర్తి ఆగస్టు 28 క్రైమ్ మిర్రర్:** రక్షాబంధన్ సందర్భంగా పెబ్బేరు పట్టణ మాజీ సర్పంచ్, మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ సతీమణి అక్కి సుశీల రాఖీ కట్టారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేకు సంప్రదాయం ప్రకారం బొట్టుపెట్టి రాఖీని చేతికి కట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసిన పెబ్బేరు మాజీ సర్పంచ్ అక్కి సుశీల ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారి అభిమానానికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



# ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం

## రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం--పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పేద కుటుంబాలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, తొలి దశ పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ సుమారు రూ.50--60 లక్షలు, నిర్మాణ వ్యయం సుమారు రూ.10--15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. గతంలో పేదలకు ఇళ్లు కేటాయించే సమయంలో వారి నివాస ప్రాంతాలకు 30--40 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి, పిల్లల చదువులు, స్థానిక సామాజిక సంబంధాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని స్పష్టం చేశారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా పరిశీలించి, పత్రాలు మరియు అర్హతలను ధ్రువీకరించిన అనంతరం తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు కాదని, అర్హులైన వారికి తదుపరి దశల్లో కూడా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్సరంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఇల్లు ఇచ్చే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం, మహిళలకు ఆస్తిపై హక్కును కల్పించే కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అనే నిబద్ధతతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్ దశల్లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) డాక్టర్ కె.కిరణ్మయి, రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, నాయకులు కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్,సరికొండ వెంకటేష్, ఎల్లప్ప, బండారి యాదగిరి నేత, బాస శ్రీనివాస్ నేత, ఓం ప్రకాష్, గట్టయ్య, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, శరణమ్మ, సంబంధిత అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

## పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్

**వనపర్తి ఆగస్టు28 క్రైమ్ మిర్రర్:** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అన్నారు.పెబ్బేరు మండల ప్రజలకు కమ్యూనిటీ పోలీసింగ్ పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దొంగతనాలు,సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామాల్లో మూఢ నమ్మకాలను నమ్మవద్దని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు, బాలకార్మిక వ్యవస్థల నిర్మూలనకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని అతిక్రమించిన వారికిపై చర్యలు ఉంటాయని చెప్పారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని అన్నారు. అంటరాని తనం నేరమని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్ నాయక్, కరుణాకర్ గౌడ్, మల్లిఖార్జున్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు




# గనులశాఖలో అవినీతి మేట

## లెక్కకు మిక్కిలిగా జయరాజ్ ఆస్తులు

## రిమాండ్‌కు ఆదేశించిన ఎసిబి కోర్టు

### 14 రోజులు రిమాండ్‌కు వరంగల్ జైలుకు తరలింపు

వరంగల్: ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. కోర్టులో హాజరు పర్చగా ఆదేశాలతో వరంగల్ జైలుకు తరలించారు. జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జయరాజ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో దాడులు చేపట్టినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. జయరాజ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ గతంలోనే గనుల శాఖ అధికారులు హెచ్చరించారు కూడా. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ తీరులో మార్పు రాలేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో జయరాజ్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందడంతో దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని జయరాజ్ నివాసంతో పాటు ఆయన స్నేహితులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఏసీబీ లెక్కల ప్రకారం జయరాజ్‌కు సంబంధించిన సుమారు రూ.65 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, తూప్రాన్, తుంగతుర్తి, సూర్యాపేటలో ఒక్కో ఎ÷-లాట్, కీసరలో రెండు ఇంటి స్థలాలు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. కేపీహెచ్‌బీలో విలువైన మరో ఎ÷-లాట్‌ను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే సుమారు రూ.20 లక్షల విలువైన ఎల్‌ఐసీ బాండ్లు, రూ.20 లక్షలకు పైగా పోస్టాఫీస్ సేవింగ్స్, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71 లక్షల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు సుమారు రూ.40 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 629 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

# రాఖీ.. ఎన్నో జ్ఞాపకాలు.. ఎప్పటికీ చెరిగిపోని బంధం



**కోదాడ ఆగస్టు 28 క్రైమ్ మిర్రర్ :** చిన్నప్పుడు చేసిన అల్లరి నుంచి.. పెద్దయ్యాక పంచుకునే బాధ్యతల వరకు.. అక్క తమ్ముళ్లు అనుబంధం జీవితంలో ఎంతో ప్రత్యేకమైనది. ఆ బంధానికి ప్రేమతో వేసే ముడే రక్షాబంధన్. చేతికి కట్టే రాఖీ చిన్నదే అయినా.. దాని వెనుక దాగి ఉన్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం మాత్రం ఎంతో పెద్దది. రక్షాబంధన్ అంటే పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యతను గుర్తుచేసుకునే పండుగగా భావిస్తారు. ఈ బంధంలో కనిపిస్తున్న చిరునవ్వులు చూస్తే.. రాఖీ కేవలం ఒక ఆచారం కాదు, కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేసుకునే అందమైన సందర్భం అనిపిస్తుంది. ఒకరినొకరు ఆటపట్టించుకోవడం, చిన్న చిన్న గొడవలు పడటం, మళ్లీ కలిసిపోవడం.. ఇవన్నీ ఈ బంధంలో భాగమే.రాఖీ కట్టే క్షణంలో సోదరి మనసులో ఉండేది ఒక్కటే నా అన్న/తమ్ముడు ఎప్పుడూ సంతోషంగా ఉండాలి” అనే కోరిక. సోదరుడి మనసులో ఉండేది --- “ఏ పరిస్థితుల్లోనైనా నా సోదరికి అండగా ఉంటాను” అనే నమ్మకం.“రాఖీ దారం చేతికి కట్టేది ఒక్కసారి.. కానీ అక్క తమ్ముళ్ల ప్రేమ అనే బంధం మాత్రం జీవితాంతం మనసుకు కట్టుబడి ఉంటుంది.

# మహేశ్వరాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో కలపాలని జేఏసీ డిమాండ్..!

ఫ్యూచర్ సిటీతో మహేశ్వరం అభివృద్ధి --- మిగిలిన గ్రామాలను కూడా కలపాలని జేఏసీ విజ్ఞప్తి...!

విలీనం కాని గ్రామాలను చేర్చాలని జేఏసీ డిమాండ్ ఈనెల 31, సెప్టెంబర్ 1న రిలే దీక్షలు...

మహేశ్వరం గ్రామ ప్రజలు సహకరించాలని జెఏసి కమిటీ పిలుపు..



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం మహేశ్వరంలో జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఇప్పటికే కొన్ని గ్రామాలు విలీనం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కొన్ని గ్రామాలు ఇప్పటికే విలీనమయ్యాయని జేఏసీ నాయకులు తెలిపారు. మిగిలిన గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో చేర్చాలని కోరుతూ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఎంపీడీవోతో పాటు జె ఎ సి కి అందజేయాలని సూచించారు.ఈ అంశంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు.

**ఫ్యూచర్ సిటీతో భారీ ప్రయోజనాలు**

జె ఎ సి ఛైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఐటీ, ఏ ఐ డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, విద్య, వైద్యం, తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగడం పెట్టుబడుల ఆకర్షణకు నిదర్శనమన్నారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలు, సంస్థలు ఏర్పాటైతే స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే రహదారులతో మహేశ్వరం రవాణాపరంగా కీలక ప్రాంతంగా మారుతుందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్, మెట్రో, రతన్ టాటా 300 ఫిట్ రేడియల్ రోడ్లు, మల్టీమోడల్ రవాణా వ్యవస్థలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.కొత్త పరిశ్రమలు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, రహదారుల అభివృద్ధితో రియల్ ఎస్టేట్, నిర్మాణం, రవాణా, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, సేవా రంగాలు విస్తరించే అవకాశం ఉందన్నారు.

**భవిష్యత్ తరాల కోసం**

జె ఎ సి గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే మహేశ్వరం ప్రాంతానికి భారీగా ప్రయోజనం చేకూరుతుందని, భవిష్యత్ తరాలకు మెరుగైన నగరాన్ని అందించేందుకు ప్రతి గ్రామ పంచాయతీ ముందుకు రావాలని కోరారు.రిలే దీక్షలకు పిలుపు ఫ్యూచర్ సిటీలో విలీనం కోసం తీర్మానం చేయని గ్రామాల సర్పంచ్‌ల తీరుకు నిరసనగా ఈ నెల 31, సెప్టెంబర్ 1న మహేశ్వరంలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని జె ఎ సి నాయకులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకుడు కడారి జంగయ్య, సీపీఐ నాయకుడు దత్తునాయక్, బీజేపీ మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, జె ఎ సి సలహాదారు కె. జగన్‌రెడ్డి, గోటికె రవీందర్‌రెడ్డి, నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు గని రాయదుర్గం భూమి

**269 కోట్లకు ఎకరా పలికిన ధర**

హైదరాబాద్: రాయదుర్గం భూములు బంగారు గనిగా మారాయి. వేలంపై సుప్రీం తీర్పు తరవాత వాటికి బంగారాన్ని మించిన ధరలు పలుకుతున్నాయి. ఇలా హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయదుర్గంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. వారం క్రితం ఇక్కడే ఎకరం ధర రూ.264 కోట్లు పలకగా, తాజాగా దాని పక్కనే ఉన్న ప్లాట్‌లో ఎకరానికి రూ.269 కోట్లు పలకడం విశేషం. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణయించింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించిన వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరాలను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండినట్లైంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.

## అమెరికాలో తెలుగుయువతి హత్య

**ఆగ్రాలో నిందితుడి పట్టివేత**

**అమెరికాకు అప్పగించనున్న పోలీసులు**

న్యూఢిల్లీ: అమెరికాలో సంచలనం సృష్టించిన హైదరాబాద్ యువతి నిఖిత గోదిశాల (27) హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్య కేసు నిందితుడు, ఆమె మాజీ రూమ్‌మేట్ అర్జున్ శర్మ (26)ను హైదరాబాద్ పోలీసులు ఆగ్రాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. ఈ హత్య కేసులో భాగంగా ఇప్పటికే నిందితుడిపై అమెరికా పోలీసులు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో ప్రస్తుతం అమెరికా అధికారులకు అర్జున్ శర్మను అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోదిశాల అమెరికాలోని మేరీల్యాండ్‌లోని ఎల్లికాట్ సిటీలో ఉద్యోగం చేస్తోంది. ఆమె కనిపించడం లేదంటూ జనవరి 2న ఫిర్యాదు అందడంతో హోవర్డ్ కౌంటీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేరీల్యాండ్‌లోని అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో నిఖిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

# విదేశాల్లో చదవాలనుకుంటున్నారా?

**బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ సర్కార్ బంపర్ ఛాన్స్**

**బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఓవర్సీస్ విద్యానిధి అవకాశం**

**350 మంది విద్యార్థులకు ఓవర్సీస్ విద్యానిధి ద్వారా ఆర్థిక సాయం**

**250 బీసీ, 100 ఈబీసీ విద్యార్థులకు అవకాశం**

**సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తుల స్వీకరణ**




హైదరాబాద్, : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులు మరో అవకాశాన్ని మిస్ చేసుకోవద్దు. మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులకు ఈ పథకం ఆర్థికంగా తోడ్పాటు అందించనుంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఇతర అర్హతలు, అవసరమైన వివరాలను పరిశీలించిన అనంతరం అర్హులైన విద్యార్థులను పథకానికి ఎంపిక చేస్తారు. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన తర్వాత చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 30తో దరఖాస్తుల గడువు ముగియనుండటంతో.. అర్హులైన విద్యార్థులు గడువులోగా అప్లికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

## వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం..

అధికారులకు మంత్రి జూపల్లి కీలక ఆదేశాలు

వాట్సాప్, ఈమెయిల్‌లో ఫిర్యాదు చేసినా స్పందించాల్సిందే

విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు 2--3 రోజుల్లో జారీ చేయాలని ఆదేశం

నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులకు హెచ్చరిక



**పానగల్, ఆగస్టు 28** ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా అధికారులు నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపైనా అధికారులు స్పందించాలని స్పష్టం చేశారు. పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల సమీక్షా సమావేశంలో మంత్రి అధికారులతో మాట్లాడారు. గత రెండున్నరేళ్లుగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఆయన సమీక్షించారు. ప్రజలు తమ పనుల్లో బిజీగా ఉండే నేపథ్యంలో సమస్యలను తెలియజేసేందుకు సాంకేతిక మార్గాలను వినియోగించుకోవచ్చని జూపల్లి తెలిపారు. పేరు, చిరునామా, ఫోన్ నంబర్‌తో కూడిన రాతపూర్వక ఫిర్యాదును వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా పంపితే.. అధికారులు దాన్ని ప్రింట్ తీసుకుని పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కారం చూపాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల విషయంలో మరింత వేగంగా స్పందించాలని ఆదేశించారు. అవసరమైన సర్టిఫికెట్లను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేయాలని అధికారులకు గడువు విధించారు. అధికారులు తమ పనితీరులో మార్పు తీసుకురావాలని జూపల్లి సూచించారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా జాప్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

## జగద్గిరిగుట్టలో ట్రాఫిక్ పోలీసుగా మారి..

**బస్సు దిగి స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించిన ఉద్యోగి**




విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతను ప్రదర్శిస్తే ప్రజల నుంచి విశేషమైన ప్రశంసలు లభిస్తాయి. సరిగ్గా ఇదే రీతిలో ఒక ఆర్టీసీ కండక్టర్ చేసిన కృషి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాఖీ పౌర్ణమి వేళ ఏర్పడిన భారీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆయన స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ పోలీసుగా బాధ్యతలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జగద్గిరిగుట్ట ఔట్‌పోస్ట్ జంక్షన్‌లో శుక్రవారం రాఖీ పండుగ దృష్ట్యా వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ పూట తమ స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులతో ఆ ప్రాంతంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరిగ్గా అదే సమయంలో అటుగా వెళుతున్న ఆర్టీసీ బస్సులోని కండక్టర్ ఈ పరిస్థితిని గమనించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన వెంటనే బస్సు దిగి రోడ్డుపైకి వచ్చి, స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించడం ప్రారంభించారు. ఆయన చూపిన చొరవతో కొద్దిసేపటికే ట్రాఫిక్ సమస్య సద్దుమణిగి, వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి. ఓ పౌరుడు ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. సదరు కండక్టర్ బాధ్యతాయుత ప్రవర్తనపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

**తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు**

**నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన**

**సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల**

**తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు**




తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు 46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు.పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023-24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025-26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం.కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం.మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది.

క్రైమ్ మిర్రర్

సినిమా

శనివారం

29-8-2026

# ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.



# నిశ్శబ్ద విధ్వంసం

సాధారణంగా స్టార్ హీరోల ఇంట్రోస్ అంటే తెరపై ఓ రేంజ్ హంగామానే సృష్టిస్తారు దర్శకులు. భారీ డీజే సౌండ్ల మధ్య, రౌడీల హాహాకారాల మధ్య హీరో తెరపై ఎంట్రీ ఇస్తాడు. అంతే అభిమానుల్లో పూనకాలు మొదలవుతాయి. కానీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా శైలి ప్రత్యేకం. 'స్పిరిట్'లో ప్రభాస్ ఎంట్రీని ఆయన చాలా భిన్నంగా ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సెంట్రల్ జైల్లో ఉన్నట్టుండి గందరగోళం చెలరేగడం.. ఖైదీలందరూ నియంత్రణ కోల్పోవడం.. పోలీసులు సైతం పరిస్థితిని అదుపు చేయలేకపోవడం.. ఈ విధ్వంసం మధ్య నిశ్శబ్దంగా ఓ హిందీ క్లాసిక్ సాంగ్ వింటూ సైలెంట్‌గా, సైకోటిక్‌గా ప్రభాస్ ఎంట్రీ ఇస్తారట. అయితే.. ఈ సన్నివేశంలో ప్రభాస్‌ని వెంటనే రివీల్ చేయకుండా, ఖైదీల కళ్లలో కనిపించే భయం ద్వారా ప్రభాస్ పాత్రకు ఎలివేషన్ ఇస్తూ, నిదానంగా ప్రభాస్‌ని రివీల్ చేస్తారట. ప్రభాస్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా చెప్పుకునేలా ఈ ఇంట్రడక్షన్ ఉంటుందని వినికిడి. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. సీనియర్ నటి కాంచన, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్‌రాజ్ ఇందులో కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాణం: టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్.




# అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది

'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు. మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను. ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా త్వరలోనే విడుదల కానున్నది.



## నాన్‌స్టాప్‌గా 'రాపో23'

హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి. 'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు.





# సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు.

# విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar